VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 8 సంచిక : 332
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
సోమవారం 14 ఏప్రిల్ 2025

# బాణసంచా పేలి ఆరుగురి మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



**అమరావతి,కలంకౌంటర్ :** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అగ్నిప్రమాద సమయంలో కర్మాగారంలో ఎంతమంది కార్మికులు ఉన్నారు, వారి పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందని సీఎం ఆరా తీశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఘటనపై విచారణ చేసి తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. అత్యవసరమైన అన్ని రకాల వైద్య సేవలు బాధితులకు అందేలా చూడాలని, బాధితుల ఆరోగ్య పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# కష్టకాలంలో సహకరించిన ప్రధాని మోదీకి, పీఎంవోకు కృతజ్ఞతలు: పవన్ కల్యాణ్



**అమరావతి,కలంకౌంటర్ :** సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ సమ్మర్ క్యాంప్‌లో అగ్ని ప్రమాదం బారినపడగా, తక్షణమే స్పందించి సహాయం అందించారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, పీఎంవోకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. సింగపూర్ అధికారులు, సింగపూర్ లోని భారత హైకమిషన్ కార్యాలయం సమన్వయంతో అందించిన సహాయం కష్ట సమయంలో ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతంలో 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో పాల్గొని, ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తుండగా ఈ బాధాకరమైన వార్త తనకు అందిందని పవన్ కల్యాణ్ తెలిపారు. తన కుమారుడికి, ప్రమాదంలో చిక్కుకున్న ఇతర పిల్లలకు సకాలంలో సహాయం అందించడం ద్వారా తన కుటుంబానికి ఎంతో ధైర్యం, ఉపశమనం లభించిందని అన్నారు. "ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల జీవితాలను మెరుగుపరచడానికి మీకున్న దార్శనిక నిబద్ధతకు అడవి తల్లి బాట నిదర్శనం. ఈ వర్గాల అవసరాలను పరిష్కరించడానికి మీరు తీసుకున్న అనేక చర్యలలో ఇది ఒకటి. వారి జీవితాలను మార్చేందుకు మీరు చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఇది కీలకమైన భాగం. పీఎం జన్ మన్, పీఎం జీఎస్ వై, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సహాయంతో, ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 1,069 కిలోమీటర్ల మేర రోడ్లను రూ.1,005 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఇది 601 బలహీన గిరిజన సమూహాల ఆవాసాల్లో కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ గిరిజన ప్రాంతాల్లో రవాణాను మెరుగుపరుస్తుంది, పర్యాటకానికి మద్దతు ఇస్తుంది, సకాలంలో వైద్య సహాయం అందిస్తుంది, ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న 'డోలీ' కష్టాలకు ముగింపు పలుకుతుంది" అని ప్రధాని మోదీని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చినందుకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

# మచిలీపట్నం అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు

- పట్టణ పుర ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్ర
- సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నంను మహానగరంగా తీర్చిదిద్దేందుకు బృహత్తర ప్రణాళికలు రూపొందించామని, ఈ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జడ్పీ కన్వెన్షన్ హాల్లో మంత్రి బంగారు బందరు సాకారం కోసం పుర ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, బందరు అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని పట్టణ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించగా, వ్యాపారవేత్తలు, న్యాయ, వైద్య తదితర రంగాలకు చెందిన ప్రముఖులు నగర అభివృద్ధికి తమ విలువైన సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన మచిలీపట్నం కాలక్రమేణ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రస్తుత జనాభా పెరుగుదలకు అనుగుణంగా సమాంతర నగర అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో విజన్, మిషన్ కలిగిన బృహత్తర ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో విద్య, వైద్య, ఉపాధి రంగాలను అభివృద్ధి చేసి బందరుకు సరికొత్త రూపం ఇవ్వనున్నామన్నారు. బందరు అభివృద్ధిని ఆకాంక్షించేవారు తమ విలువైన సలహాలు, సూచనలు తెలియజేసి నగర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా పరిధిలోని ముడా ఏరియాని సీఆర్డీఏ రాజధాని పరిధిలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు చేశామని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి కార్యరూపంలోకి తెస్తామన్నారు. గిలకలదిండి కరగ్రహారం గ్రామాల మధ్య ప్రాంతంలో 300 ఎకరాలలో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల పార్కు నిర్మాణం, ఆక్వా సంబంధిత పరిశ్రమలు, అనుకరణ ఆభరణాలు తయారీ, కలంకారి, పడవల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. డిసెంబర్ 2026 నాటికి బందరు పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తి కానున్నదని, త్వరలో పోర్టు రవాణా కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. పోర్టు ఆధార పరిశ్రమలు ఏర్పాటు ద్వారా యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మచిలీపట్నం రేపల్లె మధ్య రైల్వే లైన్ ఏర్పాటుకు డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని, దీనికి బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా మంగినపూడి బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సురక్షితమైన బీచ్ గా రూపొందించేందుకు సముద్రం వెంబడి రక్షణ గోడ నిర్మించనున్నామన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన విధంగా వచ్చే మే నెలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని క్రీడాకారులందరికీ ఉపయోగపడే విధంగా అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, ఇతర క్రీడల కోర్టుల్ల నిర్మాణానికి నగరంలోని గోసంఘం సమీపంలో సుమారు రూ.50 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు చేపట్టామని, దీనిలో భాగంగా రహదారులకిరువైపులా

- 2లో

# మట్టిలో మాణిక్యం.. రాజ్యలక్ష్మీ

- ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో మెరిసిన నున్న విద్యార్థిని
- ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్
- రాష్ట్రస్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిచి ప్రభుత్వ కాలేజీల సత్తా చాటిన వైనం





**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలంటే సహజంగానే అందిరిలోనూ చిన్నచూపు ఉంటుంది. ఆ విద్యాసంస్థలలో తమ పిల్లలను చేర్పించాల్సిన తల్లిదండ్రులు కార్పొరేట్ కాలేజీలవైపు చూస్తున్నారు. ఎలాంటి ఒత్తిడి, ఫీజుల భారం లేకుండా ఉత్తమ విద్యాబోధన అందుబాటులో ఉన్నప్పటికీ ఇవి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. మార్కుల దాహంతో తల్లిదండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలవైపు పరుగులు పెడుతున్న తరుణంలో, ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలకు వాటికేమీ తీసిపోవంటూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలలో రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచి నిరూపించింది విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గాజుల రాజ్యలక్ష్మీ. పదో తరగతి వరకు నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి 600కు 557 మార్కులు సాధించి ఆమె, ఇంటర్మీడియట్ విద్యను పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసింది. రెండు రోజుల క్రితం మానవరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో రాజ్యలక్ష్మీ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగానూ 984 మార్కులు సాధించి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల విభాగాలలో ప్రథమస్థానం సాధించింది. అంతేగాకుండా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఎయిడెడ్ కాలేజీలలో రాష్ట్రస్థాయిలోనూ దాదాపుగా అగ్రస్థానంలో నిలిచి ప్రభుత్వ విద్యా విధానం సత్తా చాటింది. కార్పొరేట్ కాలేజీలలో ఎంపీసీ విభాగంలో 992 ప్రథమ ర్యాంక్ కాగా, పాయకాపురం ప్రభుత్వం జూనియర్ కాలేజీలో చదివిని రాజ్యలక్ష్మీ 984 మార్కులు సాధించడం విశేషం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470కి 460 మార్కులు సాధించిన ఆమె, ద్వితీయ సంవత్సరంలో 530 మార్కులకు 524 మార్కులు సాధించింది. ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడతోపాటు కృష్ణాజిల్లాలో ఉన్న పేరెన్నికగన్న కార్పొరేట్ కాలేజీలుసైతం రాజ్యలక్ష్మీ మార్కులు చూసి ఆశ్చర్యపోతున్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన సత్తా ఏవిధంగా ఉంటుందో రాజ్యలక్ష్మీ సాధించిన మార్కులే నిదర్శనమని విద్యావేత్తలు చెబుతున్నారు. ప్రభుత్వ కాలేజీలకు ప్రభుత్వం నుంచి మరికొంత ప్రోత్సాహం, సహకారం అందిస్తే రాజ్యలక్ష్మీవంటి ఎందరో మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారని చెప్పడంలో ఎలాంటి సందేహమూ లేదు.

**పేదరికాన్ని జయించిన రాజ్యలక్ష్మీ..** నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజ్యలక్ష్మీ, తన విద్యా ప్రతిభా పాటవాలతో ఆ పేదరికాన్ని జయించింది. తండ్రి గాజుల సుబ్బారావు ఆటో నడుపుతూ భార్య, ఇద్దరు కుమార్తులను ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివిస్తున్నారు. ఆరో తరగతిలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరిన ఆమె, పదో తరగతిలో 557 మార్కులతో విజయవాడ రూరల్ మండలస్థాయిలో మూడోర్యాంక్ సాధించింది. ఆ తర్వాత ఇంటర్‌కు ఎన్నో కార్పొరేట్ కాలేజీలు ఉచితంగా సీటు ఇస్తామన్నా, సున్నితంగా తిరస్కరించిన రాజ్యలక్ష్మీ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరింది. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, అధ్యాపకుల సహకారంతో పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమంగా రాణించింది. ఫలితంగా 1000 మార్కులకుగానూ 984 మార్కులు సాధించి ఎంపీసీలో ప్రభుత్వ కాలేజీలలో విద్యా బోధనా సత్తాను కార్పొరేట్ లోకానికి చాటి చెప్పింది. రాజ్యలక్ష్మీ సాధించిన మార్కులను చూసిన ఆమె జూనియర్లుసైతం గతేడాది ఇంటర్‌లో పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 4న మంత్రి నారా లోకేష్ ఇదే కాలేజీలో ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాజ్యలక్ష్మీని మంత్రి లోకేష్ తన పక్కనే కూర్చోబెట్టుకుని ముచ్చటించారు.

**పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయ బృందం సత్కారం..** ఇంటర్ ఫలితాలలో ఉమ్మడి కృష్ణాజిల్లాతోపాటు రాష్ట్రస్థాయిలోనూ మెరిసిన గాజుల రాజ్యలక్ష్మీని నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి, ఉపాధ్యయులు, పీ నాగేశ్వరరావు, నళినీ రామ్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి నరెడ్ల సత్యనారాయరెడ్డి, జ్యోతిష్య పండిట్ డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ ఆదివారం ఆమె నివాసంలో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ స్కూల్, కాలేజీలో చదివి, కార్పొరేట్ వైపు దిక్కులు చూస్తున్న ఎంతో మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రాజ్యలక్ష్మీ స్ఫూర్తిగా నిలుస్తుందని హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి అన్నారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థిని ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో రాణించడంతో నున్న పేరు ప్రఖ్యాతలు రాష్ట్రానికి పాకాయన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ, త్వరలో జరగనున్న ఎంసెట్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించాలనే లక్ష్యంతో ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పింది. తన కుటుంబ పేదరికాన్ని జయించేందుకు జీవితంలో మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది తన లక్ష్యమని చెప్పింది.

# 15 నుంచి రాష్ట్రంలో చేపల వేట నిషేధం

- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు రాష్ట్రంలో చేపల వేట నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.



**విజయవాడ, కలంకౌంటర్ :** మత్స్య సంపద వృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మరబోట్లు, మెకనైజ్డ్, మోటార్ బోట్లతో మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీవో నం. 129 విడుదల చేశారు..

# తిరుమలకు బయల్దేరిన పవన్ అర్ధాంగి అనా కొణిదెల




**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అర్ధాంగి అనా కొణిదల తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. ఆమె ఈ సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అనా కొణిదల రేపు (సోమవారం) వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుంటారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తన కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడినందుకు ఆమె స్వామివారికి మొక్కులు చెల్లించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. కొన్ని రోజుల కిందట సింగపూర్ లోని ఓ కుకింగ్ స్కూల్లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ తనయుడు మార్క్ శంకర్ కు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న అనంతరం మార్క్ శంకర్ ను తీసుకుని పవన్, అనా కొణిదెల ఇండియా తిరిగొచ్చారు.

# లంకిశెట్టి ఫ్రెండ్స్ మజ్జిగ పంపిణీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వేసవి పురస్కరించుకుని లంకి శెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నం ఆజాద్ రోడ్డు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద పాదచారులకు చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంలో సుమారు 1000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ మరియు న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, ఈ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 45 వ డివిజన్ లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించినట్లు టీడీపీ డివిజన్ ఇంచార్జి పి వి ఫణి కుమార్ తెలిపారు.



# మచిలీపట్నం అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు

- పట్టణ పుర ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్ర
- సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ













(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమణలు తొలగించామని, చేస్తున్న ఈ పనిని అన్ని వర్గాల ప్రజలు సైతం హర్షిస్తున్నారన్నారు. అదేవిధంగా రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలకు ముప్పుగా మారిందని, దీనిని అధిగమించేందుకు మంగినపూడి బీచ్ ప్రాంతంలో 10 ఎకరాలు కేటాయించి, పట్టించుకోని పశువులను అక్కడకు తరలించడం జరుగుతుందన్నారు. జాతీయ కళాశాల సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. రోజుకు సరాసరి 90 టన్నులకు పైగా వస్తున్న చెత్తను ఇకనుంచి ఏరోజుకారోజు తరలించే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారని ఈ విషయంలో ఆయన్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం ఎన్నో పోరాటాలు చేశామని, బందరు పోర్టు నిర్మాణం, 216 జాతీయ రహదారి ఏర్పాటుకు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. బందరు పోర్టు ఏర్పాటుతో యువతకు లక్షలాది ఉపాధి అవకాశాలు వస్తాయని, ఈ నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. గతంలో ప్రయాణం చేసే వారికి మచిలీపట్నం చివరి ప్రాంతంగా ఉండేదని, కానీ ప్రస్తుతం మచిలీపట్నం మీదుగా ఇతర ప్రాంతాలకు ప్రయాణించే విధంగా నగరం అభివృద్ధి చెందిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నగర అభివృద్ధికి మంత్రి కొల్లు రవీంద్ర ఎంతో తపిస్తున్నారని, అందుకు అవసరమైన భూములు ఇచ్చేందుకు సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, అవి పూర్తయిన అనంతరం సంబంధిత పారిశ్రామిక పరిశ్రమలు ఏర్పాటు ఎంతో అవసరం అన్నారు. దీనికి ఏపీఐఐసీ, ఎమ్ఎస్ఎమ్ఈ తోడ్పాటుతో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. చెత్త లేని నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ మాట్లాడుతూ మచిలీపట్నం అభివృద్ధికి ప్రజల మద్దతు కావాలని కోరుతూ, ఎల్లప్పుడూ సానుకూల ఆలోచన చేసే మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ బాలాజీ ఉన్నారని కచ్చితంగా అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. నగరంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని 50 ఎకరాల్లో స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రూ.150 కోట్ల వ్యయంతో గిడ్డంగి (వేర్ హౌసింగ్) నిర్మాణం చేపట్టనున్నామని, ఇందులో రోబో టెక్నాలజీతో కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు బందరు అభివృద్ధి ఆకాంక్షపై ప్రసంగించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. భవిష్యత్తులో బందరు ఏ విధంగా రూపుదిద్దుకోనున్నదో తెలియజేసే విధంగా గ్రాఫిక్స్ దృశ్యాలను, అదేవిధంగా బందరు పోర్టు నిర్మాణ పురోగతి వివరాల దృశ్యాలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో బందరు ఆర్డీవో కే స్వాతి, కూటమి నాయకులు బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, స్థానిక నాయకులు మచిలీపట్నం పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే కొత్త ఫిల్మ్ పాలసీ

- వెస్ట్రన్ లవ్ సినిమాకి క్లాప్ కొట్టిన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్





**విజయవాడ,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఆంధ్రప్రదేశ్లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ రూపొందించిన వెస్ట్రన్ లవ్ అనే సినిమా పూజ ముహూర్త మహోత్సవానికి తొలి క్లాప్ కొట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సినిమా షూటింగ్ లకు ఆంధ్రప్రదేశ్ అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి జరగాలన్నారు. రాష్ట్రంలో స్టూడియోలు ఉన్నప్పటికీ వినియోగంలో లేవని తెలిపారు. రాష్ట్రంలో భారీగా షూటింగ్ లు జరుగుతున్నప్పటికీ మౌలిక సదుపాయాల కొరత ఉందన్నారు. హైదరాబాద్ తరహా స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లు, రీ రికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాలు రాష్టంలో కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చలనచిత్ర పరిశ్రమ రాష్ట్రం అభివృద్ధి చెందితే స్థానికంగా యువతకు, సిబ్బంది కి ఉపాధి లభిస్తుంది అన్నారు. ఏపీ లో సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడానికి అవసరమైన అంశాలపై చర్చించి నిర్మాతలతో కలిసి కొత్త సినిమా పాలసీని రూపొందిస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత పాలసీ కి సంబంధించి రూపకల్పన చేస్తున్నామని త్వరలోనే పాలసీని ప్రకటిస్తామన్నారు. వెస్ట్రన్ లవ్ సినిమా నిర్మాణానికి అవసరమైన సిబ్బందిని బయట ప్రాంతాల నుంచి కాకుండా స్థానికంగా ఉన్న సాంకేతిక నిపుణులు, ఇతర సిబ్బందితో నిర్మించనున్నామని చిత్ర దర్శకులు ఎం ఆర్ కాకర్ల, నిర్మాతలు రావి సౌజన్య,ఎం ఆర్ కాకర్ల లు తెలిపారని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందాన్ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. సినిమా కథ విన్నానని, వెస్ట్రన్ లవ్ సినిమా యువతకు మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రం అన్నారు. హీరో, హీరోయిన్ గా నటించిన రావి రామ్ చరణ్, మాహిలు చూడడానికి అందంగా ఉన్నారని తెలిపారు.. సినిమా తప్పనిసరిగా విజయం సాధించాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు.








మంగళగిరి 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ తో పాటు పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్.

–మంగళగిరి,కలంకౌంటర్ :

# ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆర్పీ సిసోడియాను చేనేత, జౌళి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయలక్ష్మికి రెవెన్యూశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేనికి ఏపీ హెచ్ఆర్డీఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. రైతు బజార్ల సీఈవోగా కె.మాధవీలతను, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఘన నివాళి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్వర్గీయ బిందెశ్వర్ ప్రసాద్ మండల్ 43వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఈడేపల్లి కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శేకు బోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీ.సీల ఆరాధ్య దైవం, బీహార్ ఏడవ ముఖ్యమంత్రి, సంఘ-సంస్కర్త, పార్లమెంట్ సభ్యునిగా స్వర్గీయ బిందెశ్వర్ ప్రసాద్ మండల్ సేవలు మరువలేనివన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ బీ.పీ మండల్ భారతదేశం మొత్తం పర్యటించి వెనుకబడిన తరగతుల వారి కష్టాలను గుర్తించారని సుబ్రమణ్యం తెలియజేశారు. ఈరోజు ఓ.బి.సి కోటాలో విద్య,ఉద్యోగాలలో 27% రిజర్వేషన్ ను బి. సి లు పొందడం మండల్ పుణ్యమే అన్నారు.కాబట్టి బిందెశ్వర్ ప్రసాద్ పోరాటాన్ని ఆశయంగా తీసుకొని బీ.సీలందరూ కలిసికట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జోగి శివ, బోగిరెడ్డి సుభాని, జన్ను గోవిందు, పెద్దిబోయిన సాంబ, చేబోయిన కోటేశ్వరరావు, ఎం. పవన్ తదితర బి. సి. నాయకులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక సేవకుడికి పరామర్శ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆధ్యాత్మిక సేవకుడు,శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు ను పరామర్శించిన శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం ప్రతినిధులు.ఇటీవలే బైపాస్ సర్జరీ చేయించుకున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మోట మర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ వాసవి అమ్మవారి ఆశీస్సులతో,మీరు చేసిన సేవా కార్యక్రమాలు ఫలితం ఆరోగ్యం కుదుట పడిందన్నారు.నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వుండాలని ఆకాంక్షించారు.

# తండ్రీ కొడుకులను, పవన్ కళ్యాణ్ ను నమ్ముకుంటే పోలీసులకు ఇదే గతి పడుతుంది: పేర్ని నాని

**విజయవాడ, కలంకౌంటర్ :** వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారంలో గుంటూరులో 11 మంది పోలీసుల సస్పెన్షన్ పై వైసీపీ నేత పేర్ని నాని తీవ్ర స్థాయిలో స్పందించారు. మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తండ్రీ కొడుకులను, పవన్ కళ్యాణ్ ను నమ్ముకుంటే పోలీసులకు ఏ గతి పడుతుందో కళ్లెదుటే కనిపిస్తోందని అన్నారు. హుందాతనం మరచి రెడ్ బుక్ రచయిత లోకేశ్ ను చూసుకుని, అడ్రస్ లేని పవన్ కళ్యాణ్ ను చూసుకుని రెచ్చిపోతే తిప్పలు తప్పవని పోలీసులను హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులను వాడుకుని వదిలేయడం సాధారణమని, ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సైలు, సీఐలు గమనించాలని సూచించారు. చంద్రబాబు ఎవరినైనా ఎర వేస్తారని, బలి చేస్తారని పేర్ని నాని తీవ్రంగా విమర్శించారు. అధికారి, బంధువు, పోలీసు, కార్యకర్త ఎవరైనా చంద్రబాబుకు ఒకటేనని అన్నారు. కేవలం కార్యకర్తలను మెప్పించడానికి 11 మంది పోలీసులకు శిక్ష విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రెడ్ బుక్ చూసో, లోకేశ్ మాటలు వినో, చంద్రబాబు ఆదేశాలనో పాటించి కొందరు పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. దొంగ కేసులు పెట్టడం, కొట్టడం, తిట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, కాబట్టి అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

# మట్టల ఆదివారం



**తిరువూరు,కలంకౌంటర్ :** మట్టల ఆదివారం సందర్భంగా పట్టణం లో రాజు పేట సి ఎస్ ఐ సంఘం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘ పెద్దలు విలియం, రవి, యేసుపా దం, తిరువూరు డీనరీ చైర్మన్ డి.దైవకృపావరము, నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ అద్యక్షుడు గంటా జయంత్ బాబు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు..



**తిరుపతి,కలంకౌంటర్ :** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎవ్వరూ తమ సమస్యల పరిష్కారం కొరకు నగరపాలక సంస్థ కార్యాలయం కు రావొద్దని కమిషనర్ తెలిపారు. రానున్న సోమవారం యధావిధిగా ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు.

# మజ్జిగ పంపిణీ



**తెలంగాణ,కలంకౌంటర్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ మంకీ జంక్షన్ నందు ఆదివారం శ్రీ వాసవి సేవక్ ఆధ్వర్యంలో 2000 ల మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలంగాణ వాసవి సేవక్ ప్రెసిడెంట్ అల్లాడి మహేష్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, కొలను రాజశేఖర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

# ఏపీలోని ఐదు ప్రాంతాల్లో రోప్‌వే

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి ఊతమిచ్చేలా కీలక అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు చోట్ రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఏపీలో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఏపీలోని ఐదు ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి గానూ డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ ఐదులో చిత్తూరుజిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, కర్నూలు అహోబిలం దేవస్థానం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడ లోని భవానీ ద్వీపం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దిగువ ఆలయం నుంచి హిల్ టాప్ వరకూ 0.68 కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. అలాగే అహోబిలం దేవస్థానం వద్ద.. ఎగువ అహోబిలం నుంచి జ్వాల నరసింహస్వామి ఆలయం వరకూ 1.28 కిలోమీటర్లు.. కోటప్పకొండ వద్ద కొండ దిగువ నుంచి ఎగువకు, పాత దేవాలయం వరకూ 1.23 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే విజయవాడలో కృష్ణా నది మీదుగా బెర్మ్ పార్క్ నుంచి భవానీ ఐలాండ్ వరకూ 0.85 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఆలయం ముందు నుంచి శిఖరాగ్రం వరకూ 0.25 కిలోమీటర్లు రోప్‌వే ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ తయారీలో కన్సల్టెన్సీ సేవల కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు. మరోవైపు ఏపీలోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రం లోని పర్యాటకులతో పాటుగా వివిధ రాష్ట్రాలనుంచి సందర్శకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో ఏపీటీడీసీ ఈ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా ప్రముఖ దేవాలయాల వద్ద రోప్?వేలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఏపీటీడీసీ ఉన్నట్లు తెలిసింది.

# కేసీఆర్ పై కోపంతో రాజ్యాంగ నిర్మాతను అవమానించడం మంచిదికాదు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,కలంకౌంటర్ :** నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ముందుకు వచ్చి కేబినెట్ మంత్రులతో సహా అంబేద్కర్ స్మృతి వనాన్ని సందర్శించి ఆ మహనీయునికి నివాళు లర్పించాలని సూచించారు. 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేయించి ఆయన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పై కోపంతో విశ్వమేధావి అయిన అంబేద్కర్ ను అవమానించడం మంచిది కాదన్నారు. ప్రపంచ దేశాలు డాక్టర్ అంబేద్కర్ ను గౌరవిస్తున్నాయని, మన పరిపాలన కేంద్రమైన సెక్రటేరియట్ పక్కనే నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించకపోవడం సముచితం కాదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు రచించిన భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి.. ఆయన పేరుతో నిర్మించిన సెక్రటేరియట్ కేంద్రంగా పాలన సాగిస్తూ కేసీఆర్ పై అక్కసుతో అంబేద్కర్ ను గౌరవించక పోవడం మంచిది కాదని సూచించారు. గతేడాది అంబేద్కర్ జయంతికి ముఖ్యమంత్రితో పాటు ఏ ఒక్క మంత్రి కానీ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించలేదని గుర్తు చేశారు. కనీసం ఆ మహనీయుని విగ్రహానికి ఒక్క పూలమాల కూడా వేయలేదన్నారు. ఈసారి అలాంటి తప్పిదం జరగకుండా ముఖ్యమంత్రి చొరవ చూపాలని కోరారు. అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం గేట్లు తెరిచి ప్రజలు సందర్శించునే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

# బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదంపై మాజీ సీఎం వైయస్ జగన్ దిగ్భ్రాంతి

**తాడేపల్లి,కలంకౌంటర్ :** అనకాపల్లి జిల్లా కోటవురట్లలో ఒక బాణా సంచా తయారీ కేంద్రంలో ప్రమాద ఘటన పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో పలువురు మరణించడం, మరికొందరు తీవ్రంగా గాయపడ్డం తీవ్ర విచారకరమన్నారు. మరణించినవారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు తోడుగా నిలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆదేశించారు. క్షతగాత్రులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్నిరకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ ప్రమాదం పార్టీ నాయకుల ద్వారా తెలియగానే వెంటనే ఘటనాస్థలానికి వెళ్లి, సహాయంగా నిలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను వైయస్.జగన్ ఆదేశించారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్
- ఒక్క రోజునే 207 కేసులు నమోదు



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ తో దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 207మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు. వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారని జిల్లా ఎస్పీ తెలిపారు. అదే విధంగా మద్యం సేవించి, వాహనాలు నడిపిన వాహనదారులపై మరో 22 కేసులు నమోదు చేసారు. జనవరి 1 నుండి ఇప్పటి వరకు మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 1814కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 6,275 కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి, పట్టుబడిన మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ఆర్చరీ వరల్డ్ కప్‌లో స్వర్ణం సాధించిన తెలుగు తేజం..



**విజయవాడ, కలంకౌంటర్ :** అమెరికాలో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 1 టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖ స్వర్ణ పతకం సాధించింది. కాంపౌండ్ మిక్స్డ్ టీం ఈవెంట్‌లో రిషబ్ యాదవ్‌తో కలిసి విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్‌లో జ్యోతి. రిషబ్ జోడి 153%-%151 తేడాతో చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ ఐ జౌ%-%చెన్ చిహు లిన్ జంటపై గెలుపొందింది....





ఎడారి ఓడ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట కు చెందిన వాసవి అన్నదాన నిర్వహణ కమిటీ కన్వీనర్ బత్తుల మురళీ ని సన్మానించిన దృశ్యం.

–గుంటూరు,కలంకౌంటర్ :

